# కాశ్మీర్ ప్రధాన ప్రశ్న దాటవేతకు కసరత్తు

**కాశ్మీరులో** ఆందోళనకర పరిస్థితి కొనసాగు తోంది. భారత పాలకులంతా తమ శక్తి సామర్ధ్యా లన్నింటినీ ప్రజలను విభజించి, అణచివేయటానికి ఉపయోగించుతూ వచ్చారు మినహా, కాశ్మీర్ ప్రజల న్యాయమైన ఆకాంక్షలను గౌరవించటానికిగానీ, తాము ఎన్నికలలో ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలు చేసేందుకు గానీ ప్రయత్నించలేదు. భారత పాలకులు కాశ్మీరీ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారనే గట్టి నమ్మకాన్ని వారికి కలిగించేవైపుగా కూడా ఏనాడూ దృష్టిపెట్టలేదు. బిజెపి నాయకత్వంలో కేంద్రంలోను; పిడిపి, బిజెపిల కూటమి నాయకత్వంలో జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోను అధికారంలో కొనసాగుతున్న పాలకులు గత ప్రభుత్వాల పాత విధానాలను అమలుచేసేందుకే తాము కట్టుబడి వున్నామని రుజువుచేసుకుంటున్నారు. పూర్తిగా బిజెపిపై ఆధారపడి కాశ్మీర్‌లో ప్రభుత్వాన్ని సాగిస్తున్న పిడిపి, బిజెపిని సంతృప్తిపరిచే చర్యలకు పూనుకుంటున్నది. బిజెపి తన మతతత్వ, విభజన రాజకీయాలతో ప్రజల మధ్య విద్వేషాలను తీవ్రం చేయటం ద్వారా తన స్థానాన్ని పదిలపరచుకోవాలని భావిస్తోంది.

గత రెండు దశాబ్దాల కాశ్మీరీ ప్రజల అనుభవాలు చాలా కఠోరంగా వున్నాయి. ఒక రచయితతో కాశ్మీరీ యువకుడొకరు ఇలా అన్నారు : 'నా చిన్నతనంలో వారు (సైనిక బలగాలు) తీవ్రవాదుల కోసం (మా ఇండ్లలో) వెదికేవారు. నేను పెద్దవుతున్న దశలో ఆ సైనిక బలగాలు తీవ్రవాదుల అనుచరుల కోసం గాలింపు చేసేవారు. నేను పెద్దవాడినయ్యాక 2008లో అమరనాథ్ భూ ఆందోళన బ్రద్దలైంది. కాశ్మీరీలోయలో రాళ్ళతో యుద్ధాలు జరిగాయి. చొరబాటుదారుల వ్యతిరేకులు, రాళ్ళు విసిరేవానిలో ఓ కొత్త శత్రువును కనుగొన్నారు. ఈ కథలు ఇళ్ళవరకు వ్యాపించి, అనుమానితుడైన, రాయివిసిరిన వానికోసం గాలింపులు ప్రారంభమయ్యాయి. 2009లో సోఫియా జిల్లాలో నీలోఫర్‌జాన్, ఆసియాజాన్‌లపై అత్యాచారం, హత్య ఘటనతో కాశ్మీర్ మరోమారు కంపించింది. ఆ యువతుల మృతదేహాలు ఓ యాపిల్ తోటలో కనుగొన్నారు. ఈ అత్యాచారం, హత్యలకు అక్కడికి దగ్గరలోని సిఆర్‌పిఎఫ్ బలగాల శిబిరంలోని సైనికులే బాధ్యులని స్థానిక ప్రజానీకం ముక్తకంఠంతో నినదించారు. ఆనాటి నుండి మేము మా మహిళల గురించి ఆలోచిస్తున్నాము" అని చెప్తూ ఆ యువకుడు కొంత కలత చెందాడు. ఆపై తేరుకొని 'ఇక్కడ ఏమైనా జరిగేందుకు అవకాశముంది' అన్నాడు.

ఈ పరిస్థితి ఇక్కడతో అంతంకాలేదు. ఒక సం॥రం తర్వాత, 2010లో మరో ఆందోళన కాశ్మీర్‌ను కుదిపేసింది. ఉత్తర కాశ్మీర్‌లో ముగ్గురు "పాకిస్తానీ చొరబాటుదారులను" సైనిక బలగాలు ఈసారి కాల్చి చంపాయి. కానీ ఆ తర్వాత వీరిని నాదిహాల్ గ్రామస్థులుగా గుర్తించారు. స్థానిక ఇన్‌ఫార్మర్‌తో ఓ సైనికాధికారి కుమ్మక్కై ముగ్గురు యువకులను పట్టుకొని తెచ్చి కాల్చిచంపి, చొరబాటుదారులను కాల్చి చంపిన పేరుతో ప్రభుత్వం నుండి నగదు బహుమతులను అందుకున్నాడు.

ఇవే కథలు ఈనాటికీ పునరావృతమౌతున్నాయి. కాశ్మీర్‌లోని విశాల ప్రాంతాలన్నీ కల్లోలిత ప్రాంతాలుగా వున్నాయి. ఏఎఫ్ఎస్‌పిఏతో సాయుధమైన సైనిక బలగాల ఉక్కుపాదం క్రింద ఆ ప్రాంతాలన్నీ ఈనాటికీ చిక్కుకొని నలిగిపోతూ వున్నాయి. పిఎస్ఏ తదితర చట్టాల క్రింద, కల్పించి పెట్టబడిన పలు కేసులలో వేలాదిమంది కాశ్మీరులు–ముఖ్యంగా యువత–జైళ్ళలో మగ్గుతున్నారు. భయోత్పాతపు వాతావరణంలో, అభద్రతలో, సాధారణ జీవితానికి దూరమై ప్రజలు బతుకులీడుస్తున్నారు. జీవనాధారాలు, ఉద్యోగాలు లేకపోవటమేగాక కనీస ప్రజాస్వామిక హక్కులు కూడా వారికి మృగ్యమయ్యాయి. జీవితంలో పెరుగుతున్న భారాలు వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నాయి. యువతలో అత్యధికులను అనుమానితులపేరున, వారికి మద్దతుదారుల పేరున వెంటాడి, వేధిస్తున్నారు. ఈ జీవితం మరింత దుర్భరం అనిపించటం కారణంగా అధికశాతం ప్రజానీకంలో తాము పరాయివారమనే భావం బలపడుతోంది.

ఈ పరిస్థితులలో కాశ్మీరు ప్రజానీకం మొత్తంగానూ, ప్రత్యేకించి యువజనులు – తమకోపం, నిరసన, బాధలను వ్యక్తం చేసేందుకు విభిన్న పద్ధతుల నెంచుకొంటున్నారు. తిరస్కార ధోరణి ప్రజలలో బలం పుంజుకుంది. ఈ మార్గంలో కాశ్మీర్‌లో వివిధ నిరసనోద్యమాలు ఊపందుకున్నాయి. 'పాకిస్తాన్ అనుకూలుడు', 'మిలిటెంట్', 'వేర్పాటువాది' తదితర పదాలను ప్రభుత్వం లేదా సైనిక బలగాలు తమ పేర్లకు జోడించినప్పటికీ ప్రజలు వీటికి బెదిరిపోవడంలేదు. దీనిని బట్టి ప్రజానీకం, ప్రత్యేకించి యువత ప్రభుత్వ వ్యతిరేకులుగా పిలిపించుకోవటాన్ని గౌరవనీయమైందిగా, న్యాయంకోసం పోరాటం సాగించటంగా పరిగణించటం పెరుగుతోంది.

ఇటీవల కుల్గాం జిల్లాలో జరిగిన ఓ సంఘటన దీనికి ఓ తార్కాణంగా వుంది. 2015 అక్టోబర్ 30న, దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాంజిల్లా, బుగాన్ గ్రామంలో అబు కాసిం అనే అతని మృతదేహాన్ని పూడ్చేందుకు పోలీసులు పూనుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం అతను ఓ పాకిస్థానీ మిలిటెంట్, మరియు ఉధంపూర్ దాడిలో కీలకమైన వ్యక్తి; అంతేగాక ఉత్తర కాశ్మీర్‌లో దార్ అనే ముఖ్యుని మాటుగాసి దాడులలో హత్య గావించినవాడు. ఈ అబూకాసిమ్ ఖననం గురించి తెలియటంతో పదుల వేలసంఖ్యలో ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకొని భారీ ప్రదర్శన నిర్వహించారు. వీరిలో అత్యధికులు 20–30 సం॥ వయస్సులోపువారే. కార్లు, మిని బస్సులు, మోటార్ బైక్‌లపై సమీప గ్రామాలనుండే కాక, పొరుగు జిల్లాల నుండి కూడా యువకులు వచ్చి ఈ ప్రదర్శనలో

పాల్గొన్నారు. యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. అంతిమంగా భారీ ప్రజా నిరసన కారణంగా అబూ కాసిం మృతదేహాన్ని తమ స్వాధీనం చేసుకొని అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సంఘటన కాశ్మీర్ ప్రజల మానసిక స్థితికి అద్దం పడుతోంది.

కేంద్రంలో ఈనాడు అధికారంలోనున్న బిజెపి, తమకంటే ముందు పాలన సాగించినవారి అనుభవాల నుండి కానీ, లేదా తమ ఆచరణ అనుభవాలనుండిగానీ ఏమాత్రం పాఠాలు గ్రహించటానికి సిద్ధంగాలేదు.

బిజెపి మతతత్వ విభజనను పెంచే విధానాలను కాశ్మీర్‌లో అనుసరిస్తోంది. ఈరకంగా రాష్ట్రంలో తన బలాన్ని, మద్దతును పెంచుకోజూస్తోంది. అత్యంత దుష్పరిణామాలతో కూడిన ప్రమాదకరమైన క్రీడ ఇది. కత్తులను, తుపాకులను, ఇతర ఆయుధాలను ప్రదర్శిస్తూ, 'అగర్ హిందూస్తాన్ మే రహనా హై తో వందేమాతరమ్ కహనా హై' వంటి నినాదాలు చేస్తూ విజయదశమి సందర్భాన్ని పురస్కరించుకొని జమ్మూ పట్టణంలో ఆర్ఎస్ఎస్ నిర్వహించిన ప్రదర్శన; దీనిని విమర్శించి నందుకుగాను ఉత్తరకాశ్మీర్‌లోని లాన్‌గేట్ నియోజకవర్గ స్వతంత్ర ఎమ్ఎల్ఏ ఇంజనీర్ రషీద్‌పై వారి దాడి, ఇవన్నీ ఈ క్రీడలో భాగమే. ఈ రకమైన కార్యకలాపాల ద్వారా హిందూ మతతత్వవాదులు కాశ్మీర్‌లోని ప్రజలను విభజించటమేగాకుండా నూతన సమస్యలకు బీజాలు వేస్తున్నారు.

నరేంద్రమోడీ ప్రభుత్వం కూడా అభివృద్ధి నినాదాన్నందుకొని కాశ్మీర్ యువకులలో భ్రమలు కల్పించేందుకు వారి ఆర్థిక ఉన్నతి గురించి, ఉద్యోగ కల్పనల గురించి భారీస్థాయి శుష్క వాగ్దానాలు చేస్తోంది. ఎంతో ప్రచార ఆర్భాటాలతోసాగిన 2015 నవంబర్ 7 నాటి నరేంద్రమోడీ శ్రీనగర్ పర్యటన, ఆ సందర్భంగా జరిగిన బహిరంగసభలో 80 వేల కోట్ల రూ॥ సహాయ ప్రకటనలన్నీ వీరిని ఆకట్టుకునే ప్రయత్నాలలో భాగమే.

గత 18 నెలల కాలంలోనూ, గతంలోనూ ఈలాంటి ప్రకటనల గురించి, వాటి భవితవ్యం గురించి కాశ్మీర్ ప్రజలకు తగినన్ని అనుభవాలు వున్నాయి. కాశ్మీర్ వరద బాధితుల సహాయం, పునరావాసాల కోసం మోడీ ఈ భారీ సహాయ ప్రకటన చేసినప్పటికీ, సర్వస్వం కోల్పోయి, జీవితాలను పునరుద్ధరించు కొనేందుకు ప్రజలు ఈనాటికీ తీవ్ర ఇబ్బందుల నెదుర్కొంటున్నారు. శ్రీనగర్ షేర్ – ఇ – కాశ్మీర్ క్రికెట్ స్టేడియంలో నవంబర్ 7న మోడీ బహిరంగసభ నిర్వహించిన తీరు, ప్రజాస్వామ్య బూటకత్వాన్ని వెల్లడి చేయటంతోపాటు, మోడీ ప్రాచుర్యం పెంచుకోవటానికి చేపట్టిన చర్యగా అర్థమౌతుంది. అదేరోజున హురియత్ ఆధ్వర్యంలో మరో ప్రాంతంలో నిర్వహించ తలపెట్టిన 'మిలియన్ మార్చ్'ను పోలీసులు అడ్డుకొని ఆ నాయకత్వాన్ని, వారి కార్యకర్తలను ముందుగానే అరెస్టుచేసి కార్యక్రమాన్ని జరగనీయకుండా చేశారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ, ప్రజలకు 30 మీటర్ల దూరంలోనున్న బహిరంగసభా వేదిక పైనుండి ప్రజలనుద్దేశించి మోడీ ప్రసంగించాడు. ఎంపికచేసిన, పరీక్షించి లోనికి పంపిన ప్రజలతో మాత్రమే ఈ సభ జరిగిందని స్పష్టమౌతోంది.

కాశ్మీర్ ప్రజానీకం అసంఖ్యాకమైన జీవన సమస్యలతో సతమతమౌతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి, కనీసం ఉపశమనం కోసం వారికి వీలైన అన్ని పద్ధతుల్లో వారు పోరాడుతున్నారు. అదే సమయంలో, దశాబ్దాల కాలంగా తమ జీవితాలపైనా, ప్రజాస్వామిక హక్కులపైనా సాగుతున్న క్రూరమైన దాడి వారికి ఓ ప్రధాన సమస్యగా, జీవన్మరణ సమస్యగా ముందు నిలిచి వుంది. కొన్ని ఆశలు వారికి చూపుతూ అదే సమయంలో వారి న్యాయమైన జాతీయ, ప్రజాస్వామిక ఆకాంక్షలను బలవంతంగా కాలరాచివేస్తూ కాశ్మీరు ప్రజల హృదయాలను గెలవగలమనుకోవటం, భారత పాలకుల భ్రమే అవుతుంది.

కనుక, తక్షణం ప్రజలను విభజించే, ప్రక్కదోవ పట్టించే మోసగించే పద్ధతులన్నింటినీ విడనాడాలి. కాశ్మీర్ రాజకీయ భవితవ్యం గురించి ప్రజలు నిర్భయంగా తమ భావాలను ప్రకటించగలిగే స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక, శాంతియుత పరిస్థితులను, వాతావరణాన్ని నెలకొల్పాలి. కాశ్మీర్ ప్రజల భవితవ్యాన్ని నిర్ణయించే హక్కును కాశ్మీరీలకే వదలివేయాలి; కాశ్మీర్ ప్రజలు తమ ప్రయోజనాల కనుగుణంగా సరైన నిర్ణయం తీసుకోగల సామర్థ్యం కలిగివున్నారు; ఆ పరిణితిని ప్రదర్శించగలుగుతారు.

oooooo